
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ **కోనసీమ** జిల్లా వార్తలు

శుక్రవారం 21 జూన్ 2024





పెద్దాయనకు దక్కిన గౌరవం: ప్రొటెం స్పీకర్‌గా సీనియర్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనతో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఇలా ప్రమాణ స్వీకారం చేయించారు. 174 మంది శాసనసభ్యులతో ఆయన ప్రమాణస్వీకారం చేయిస్తారు.



అనే నేను..

నేడు కూటమి ప్రభుత్వ తొలి అసెంబ్లీ

- ప్రొటెం స్పీకర్‌గా గోరంట్ల
- ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం
- మూడు జిల్లాల్లో 21 మంది
- రంప నుంచి ఒకరు
- వీరిలో 12 మంది కొత్తవారే
- ముగ్గురికి మంత్రి పదవులు
- డిప్యూటీ సీఎంగా పవన్‌కల్యాణ్
- 10 మందికి మళ్లీ ఛాన్స్
- అందరూ కూటమి సభ్యులే

(రాజమహేంద్రవరం/కాకినాడ/ అమలాపురం - ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ఏర్పడిన తర్వాత తొలిసారిగా అసెంబ్లీ సమావేశాలు శుక్రవారం ప్రారంభంకానున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలందరితో ప్రొటెం స్పీకర్ ప్రమాణ స్వీకారం చేయిస్తారు. దీనికోసం ముందుగా ప్రొటెం స్పీకర్‌గా సీనియర్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనతో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఇక 21, 22వ తేదీల్లో జరిగే రెండు రోజుల సమావేశాలను గోరంట్ల బుచ్చయ్యచౌదరి నిర్వహిస్తారు. శుక్ర, శనివారాల్లో మొత్తం 174 మంది ఎమ్మెల్యేలతోనూ ప్రమాణ స్వీకారం చేయిస్తారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, రాష్ట్రమంత్రులు, ఎమ్మెల్యేగా గెలిచిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేత కూడా అయన ప్రమాణ స్వీకారం చేయిస్తారు. 22న రాష్ట్ర స్పీకర్‌ను ఎన్నుకున్న తర్వాత ఆయన బాధ్యత తీరిపోతుంది. ఏడు సార్లు అసెంబ్లీకి ఎన్నికైన గోరంట్ల బుచ్చయ్యచౌదరికి గౌరవంగా ఈ అవకాశం దక్కింది. రాజమండ్రి సిటీ నుంచి నాలుగు సార్లు, రాజమండ్రి రూరల్ నుంచి మూడు సార్లు గోరంట్ల శాసనసభ్యుడిగా ఎన్నికైన సంగతి తెలిసిందే. గతంలో మంత్రిగా కూడా పనిచేశారు.ఏ ప్రాధాన్యతా క్రమంలో అసెంబ్లీలో ప్రమాణ స్వీకారాలు ఉంటాయనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

ముగ్గురు మంత్రులూ బాధ్యతల్లోకి..

కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల నుంచి ముగ్గురు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇందులో పిఠాపురం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, అటవీ, పర్యావరణ శాఖల మంత్రిగా ఇప్పటికే బాధ్యతలు స్వీకరించగా, నిడదవోలు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న కందుల దుర్గేష్ టూరిజం, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రిగాను, రామచంద్రపురం ఎమ్మెల్యేగా ఎన్నికైన వాసంశెట్టి సుభాష్ కార్మిక శాఖా మంత్రిగాను గురువారం బాధ్యతలు స్వీకరించారు.అయితే వీరు ముగ్గురితో కూడా శాసనసభలో ప్రొటెం స్పీకర్ ప్రమాణ స్వీకారం చేయిస్తారు.

తూర్పుగోదావరి జిల్లా నుంచి..

నిడదవోలు జనసేన ఎమ్మెల్యే కందుల దుర్గేష్‌కు మంత్రి పదవి దక్కిన సంగతి తెలిసిందే. అయన గురువారం సచివాలయంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. రాజమహేంద్రవర నగర నివాసి అయిన మంత్రి దుర్గేష్ తాత పోతుల వీరభద్రరావు రాజమండ్రి సిటీ ఎమ్మెల్యేగానూ, మున్సిపల్ చైర్మన్‌గా పలుదఫాలుగా పనిచేశారు. దుర్గేష్ అసెంబ్లీలోకి తొలిసారి ప్రవేశిస్తున్నారు. ఎమ్మెల్సీగా గతంలో శాసనమండలిలో ఆరేళ్లపాటు ఉన్నారు. ఆయన రాజమహేంద్రవరం సిటీకి చెందిన నాయకుడైనప్పటికీ నిడదవోలు నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలవడంతో పాటు మంత్రి పదవి కూడా దక్కించుకోవడంతో ఎక్కువ దృష్టి అయనకు నిడదవోలు మీదే ఉంటుంది. త్వరలో అక్కడ సొంతిల్లు కూడా ఏర్పాటుచేసుకోనున్నారు. ఇక కొవ్వూరు నుంచి టీడీపీ ఎమ్మెల్యేగా ఎన్నికైన ముప్పిడి వేంకటేశ్వరరావు రెండోసారి అసెంబ్లీలోకి అడుగుపెడుతున్నారు. 2014లో ఆయన గోపాలపురం నుంచి టీడీపీ అభ్యర్థిగా గెలిచి అసెంబ్లీకి వెళ్లారు. ఇవాళ కొవ్వూరు నుంచి గెలిచారు. అనపర్తి నుంచి కూటమి తరపున బీజేపీ ఎమ్మెల్యేగా గెలిచిన నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కూడా రెండో సారి అసెంబ్లీలోకి అడుగుపెడుతున్నారు. 2014లో టీడీపీ ఎమ్మెల్యేగా అసెంబ్లీకి వెళ్లిన రామకృష్ణారెడ్డి ఈసారి పొత్తు వల్ల అనూహ్యంగా బీజేపీ అభ్యర్థిగా పోటీచేసి ఎమ్మెల్యే అయ్యారు. ఆయన ఈసారి బీజేపీ ఎమ్మెల్యేగా అసెంబ్లీలోకి అడుగుపెడుతున్నారు.జిల్లాలో ఏడుగులు ఎమ్మెల్యేలకుగాను నలుగురు తొలిసారి అసెంబ్లీలో అడుగుపెడుతున్నారు. నిడదవోలు నుంచి కూటమి తరపున గెలిచిన రాష్ట్రమంత్రి కందుల దుర్గేష్, రాజమండ్రి సిటీ టీడీపీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు తొలిసారిగా అసెంబ్లీలోకి అడుగుపెడుతున్నారు. 2019లో వైసీపీ సునామీలో కూడా ఆయన సతీమణి ఆదిరెడ్డి భవానీ టీడీపీ ఎమ్మెల్యేగా గెలిచిన సంగతి తెలిసిందే. ఆయన తండ్రి అప్పారావు ఎమ్మెల్సీగా బాధ్యతలు నిర్వహించారు. ఆయన తల్లి రాజమండ్రి కార్పొరేషన్ తొలి మేయర్. రాజానగరం నుంచి జనసేన ఎమ్మెల్యేగా ఎన్నికైన బత్తుల బలరామకృష్ణ తొలిసారి అసెంబ్లీలోకి అడుగుపెడుతున్నారు. ఇక గోపాలపురం నుంచి టీడీపీ ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు కూడా తొలిసారి అసెంబ్లీలో అడుగుపెడుతున్నారు.

కాకినాడ జిల్లా నుంచి..

ఎన్నికల అనంతరం అసెంబ్లీ శుక్రవారం కొలువుతీరనున్నది. కాకినాడ జిల్లా నుంచి నలుగురు శాసనసభ్యులు తొలిసారి సభలో అడుగుపెట్టనున్నారు. ఇప్పటికే పిఠాపురం ఎమ్మెల్యే, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ బాధ్యతలు స్వీకరించి శాఖాపరంగా విజయవాడలో సమీక్షలు నిర్వహిస్తున్నారు. కాకినాడ సిటీ, కాకినాడ రూరల్, తుని, ప్రత్తిపాడు, పెద్దాపురం, జగ్గంపేట ఎమ్మెల్యేలు వనమాడి వెంకటేశ్వరరావు, పంతం నానాజీ, యనమల దివ్య, వరుపుల సత్యప్రభ, నిమ్మకాయల చినరాజప్ప, జ్యోతుల నెహ్రూ జిల్లా నుంచి అమరావతికి తరలివెళ్లారు. జిల్లాలో ఏడుగురు ఎమ్మెల్యేలు ఉండగా, ఇందులో పిఠాపురం నుంచి జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అసెంబ్లీకి ఎన్నికకావడం ఇదే తొలిసారి. 2014 ఎన్నికల ముందు జనసేన పార్టీ స్థాపించిన పవన్ 2019 ఎన్నికల్లో పోటీచేసినా విజయం సాధించలేకపోయారు. ప్రస్తుత ఎన్నికల్లో రికార్డుస్థాయి మెజార్టీతో విజయం సాధించడమే కాకుండా తన పార్టీ తరపున పోటీ చేసిన 21 మంది శాసనసభ్యులుగా ఎన్నికకావడంతో విజయదరహాసంతో సభలో అడుగుపెట్టనున్నారు. అసెంబ్లీలో రెండో అతి పెద్ద పార్టీగా జనసేన ఉండనున్నది. ప్రత్తిపాడు నుంచి వరుపుల సత్యప్రభ, తుని నుంచి యనమల దివ్య, కాకినాడ రూరల్ నుంచి పంతం నానాజీ తొలిసారి సభలో అడుగుపెట్టనున్నారు. సత్యప్రభ భర్త రాజా గత ఎన్నికల్లో పోటీచేసినా విజయం సాధించలేకపోయారు. రాజా ఆకస్మిక మరణంతో రాజకీయాల్లోకి వచ్చిన సత్యప్రభ తాను పోటీ చేసిన తొలి ఎన్నికల్లోనే విజయం సాధించారు. అదే విధంగా మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు కుమార్తె అయిన దివ్య తొలి ఎన్నికల్లోనే గెలుపును సొంతం చేసుకున్నారు. పలుసార్లు ఎన్నికల్లో పోటీ చేసి విజయతీరాలకు చేరలేకపోయిన జనసేన నేత పంతం నానాజీ ఈ సారి మాత్రం జిల్లాలోనే రికార్డుస్థాయి మెజార్టీతో కాకినాడ రూరల్ నుంచి గెలుపొందారు. ఇప్పటికే పలుసార్లు ఎమ్మెల్యేలుగా పనిచేసిన కాకినాడ, జగ్గంపేట ఎమ్మెల్యేలు వనమాడి వెంకటేశ్వరరావు(కొండబాబు), జ్యోతుల నెహ్రూలు మరోమారు అసెంబ్లీలో అడుగుపెడుతున్నారు. పెద్దాపురం నుంచి వరుసగా మూడోసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన నిమ్మకాయల చినరాజప్ప అసెంబ్లీకి వెళ్లనున్నారు.

కోనసీమ జిల్లా నుంచి..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి ఈసారి ముగ్గురు ఎమ్మెల్యేలు తొలిసారిగా అసెంబ్లీలోకి అడుగుపెడుతున్నారు. వీరిలో వాసంశెట్టి సుభాష్ తొలిసారిగా ఎమ్మెల్యేకావడంతో పాటు అనూహ్యంగా మంత్రిగానూ బాధ్యతలు స్వీకరించారు. జనసేన నుంచి రాజోలులో పోటీచేసి గెలిచిన దేవ వరప్రసాద్ కూడా తొలిసారిగా అసెంబ్లీలోకి అడుగుపెడుతున్నారు. వరప్రసాద్ సీనియర్ ఐఏఎస్. అలాగే పి.గన్నవరం నుంచి జనసేన ఎమ్మెల్యేగా గెలిచిన గిడ్డి సత్యనారాయణ తొలిసారిగా ఎమ్మెల్యేగా అసెంబ్లీ మెట్లు ఎక్కనున్నారు. సత్యనారాయణ కూడా పోలీసు శాఖలో అధికారిగా పనిచేశారు. ఇక మండపేట నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన వేగుళ్ల జోగేశ్వరరావు వరుసగా నాలుగోసారి శాసనసభ్యుడిగా అడుగుపెడుతున్నారు. కొత్తపేట నుంచి ఎమ్మెల్యేగా మరోసారి ఎన్నికైన బండారు సత్యానందరావు కూడా నాలుగోసారి అసెంబ్లీలో అడుగుపెడుతున్నారు. అమలాపురం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన అయితాబత్తుల ఆనందరావు రెండోసారి అసెంబ్లీలోకి అడుగుపెడుతుండగా, ముమ్మిడివరం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన దాట్ల బుచ్చిబాబు మూడోసారి అసెంబ్లీలోకి అడుగుపెడుతున్నారు. జిల్లాలో మొత్తం ఏడు నియోజకవర్గాలకు నలుగురు సీనియర్లు, ముగ్గురు తొలిసారి అసెంబ్లీలోకి అడుగుపెడుతున్నారు.

రంపచోడవరంలోనూ..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోకి రంపచోడవరం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన మిరియాల శిరీషాదేవి కూడా తొలిసారి అసెంబ్లీలోకి అడుగుపెడుతున్నారు. అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తున్న ఈమె ఏకంగా అసెంబ్లీలోకి టీడీపీ ఎమ్మెల్యేగా అడుగుపెడుతుండడం విశేషం.

కొత్త ఎమ్మెల్యేలదే హవా..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాగా చూసినా, కొత్తగా ఏర్పడిన మూడు జిల్లాల పరిధిలో చూసినా తొలిసారిగా ఎమ్మెల్యేలుగా అడుగుపెడుతున్న వారే అధికంగా ఉండడం విశేషం. మూడు జిల్లాల నుంచి ముగ్గురు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తుండగా, వీరంతా మొదటిసారి అసెంబ్లీలోకి అడుగు పెడుతున్నవారే. కాకినాడ జిల్లా నుంచి తుని, ప్రత్తిపాడు, పిఠాపురం, కాకినాడ రూరల్ నుంచి ఎమ్మెల్యేలు తొలిసారిగా అసెంబ్లీ లోకి అడుగు పెడుతుండగా, అటు రంపచోడవరం నుంచి ఎమ్మెల్యే తొలిసారిగానే అడుగుపెడతారు.డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి రామచంద్రపురం, పి.గన్నవరం, రాజోలు నుంచి కొత్తవారే అసెంబ్లీలోకి అడుగుపెడుతుండగా,తూర్పుగోదావరి జిల్లా నుంచి రాజమండ్రి సిటీ, రాజానగరం,నిడదవోలు, గోపాలపురం ఎమ్మెల్యేలు తొలిసారిగా అసెంబ్లీ మెట్లు ఎక్కుతున్నారు. మూడు జిల్లాల్లో 21 నియోజకవర్గాలు, అటు రంపచోడవరం నియోజకవర్గం మొత్తం 22 మందిలో 12 మంది కొత్తవారే, పది మంది సీనియర్లు.







మంత్రి కందుల దుర్గేష్‌కు అభినందనలు తెలుపుతున్న శేషారావు

నా శాఖకు వన్నె తెస్తా : దుర్గేష్

నిడదవోలు,జూన్ 20 : మంత్రిగా నా శాఖకు వన్నె తెస్తానని రాష్ట్ర ప్రభుత్వ పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.అమరావతిలో గురువారం సాయంత్రం 5.51 గంటలకు ఆయన మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన వెంట కుమారుడు డాక్టర్ కందుల కృష్ణతేజ, డాక్టర్ సుస్మిత, అల్లుడు ఈలి సత్యేంద్ర, కుమార్తె ఈలి శ్రీరంగప్రియ ఉన్నారు.అనంతరం కందుల దుర్గేష్‌కు నిడదవోలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు శుభాకాంక్షలు తెలిపారు.నిడదవోలు నియోజకవర్గం నుంచి అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిచిన కందుల దుర్గేష్ మంత్రిగా బాధ్యతలు స్వీకరించడం ఆనందంగా ఉందన్నారు.లండన్ నుంచి ఫోన్ చేసి డాక్టర్ తోపరాల కల్యాణ్ చక్రవర్తి అభినందనలు తెలిపారు.సిటికేబుల్ ఎండీ నీలం నాగేంద్ర ప్రసాద్, ఆనందం వెంకటేశ్వర్లు, జనసేన నిడదవోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ భోగవల్లి ప్రసాద్ తదితరులు అభినందనలు తెలిపారు.



అసెంబ్లీలోని తన చాంబర్‌లో తల్లిదండ్రులు, భార్య పిల్లలతో మంత్రి వాసంశెట్టి సుభాష్

చాంబర్‌లో మంత్రిగా తొలి సంతకం పెడుతున్న సుభాష్

కార్మికుడిగా పనిచేస్తా : సుభాష్

రామచంద్రపురం (ద్రాక్షారామ), జూన్ 20: కార్మికుల సంక్షేమానికి తాను కూడా ఒక కార్మికుడిగా పనిచేస్తానని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ చెప్పారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రిగా గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ చాంబర్‌లోకి ప్రవేశించారు. ఆయన సతీమణి లక్ష్మీసునీత, కుమార్తెలు, తల్లిదండ్రులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 7.34 గంటలకు మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆయనకు వేద పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. అనంతరం మంత్రి సుభాష్ విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం కార్మికుల సంక్షేమ పథకాలు 13 వరకు తొలగించిందన్నారు. కార్మికుల సంక్షేమం టీడీపీ హయాంలోనే జరిగిందన్నారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డు నిధులను వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించిందన్నారు. ఈఎస్ఐ ఆసుపత్రుల్లో కేంద్ర ప్రభుత్వం వేతనాలు ఇచ్చే పోస్టులను కూడా భర్తీ చేయలేదన్నారు. కాగా జిల్లావ్యాప్తంగా టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు, అభిమానులు సచివాలయానికి తరలివెళ్లారు. మంత్రి సుభాష్‌కు జనసేన రామచంద్రపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ కట్టా నాగేశ్వరరావు, కౌన్సిలరు అంకం శ్రీనివాస్, పట్టణ శాఖ అధ్యక్షుడు గొల్లపల్లి కృష్ణ, టీడీపీ నేత మేడిశెట్టి శేషారావు, మాజీ ఎంపీటీసీ విత్తనాల వెంకటరమణ, మాజీ కౌన్సిలరు దంగేటి గౌరీశంకర్, కడియాల రాఘవన్, నండూరి ఫణికుమార్, పితాని వీరభద్రరరావు, పెంకె సాంబశివరావు, కంచుమర్తి బాబూరావు, నెం.1 బాబు శుభాకాంక్షలు తెలిపారు.



బొమ్మూరులోని కలెక్టరేట్ వెనుక ముస్తాబైన సైన్స్ మ్యూజియం

పవన్..పవర్!

- బొమ్మూరు సైన్స్ మ్యూజియం త్వరలో ప్రారంభం
- డిప్యూటీ సీఎం పవన్ ఆదేశాలతో కదలిక

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఎట్టకేలకు సైన్స్ మ్యూజియం ప్రారంభం కానుంది. దీన్ని వెంటనే ప్రారంభించాలని ఉపముఖ్యమంత్రి, సైన్స్ అండ్ టెక్నాలజీ, పంచాయతీరాజ్, గ్రామీణ నీటిసరఫరా శాఖల మంత్రి పవన్‌కల్యాణ్ గురువారం సమీక్షల్లో భాగంగా ఆదేశించారు. దీంతో అధికారుల్లో కదలిక వచ్చింది. గత పుష్కరాల సమయంలో నాటి సీఎం చంద్రబాబు, ఎంపీ మాగంటి మురళీమోహన్ చొరవతో రాజమహేంద్రవరానికి సైన్స్ మ్యూజియం మంజూరైంది. రూ.16.82 కోట్లు కేటాయించారు. బొమ్మూరులోని మహిళా ప్రాంగణం పక్కన ప్రధాన రహదారిని ఆనుకుని ఐదెకరాల స్థలంలో కేంద్రం, రాష్ట్రం సమాన భాగస్వామ్యంతో దీనిని నిర్మించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఏపీ సీఓఎస్‌టీ) ఆధ్వర్యంలో కలకత్తాలోని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియం (ఎన్‌సీఎస్ఎం) ఇది నిర్మించింది. 2017లో మంజూరుకాగా 2018 ఫిబ్రవరి 18న శంకుస్థాపన చేయగా 2019లో పనులు ఆరంభమయ్యాయి. విద్యార్థులకు సైన్స్‌పరంగా బాగా ఉపయోగపడే విధంగా విజ్ఞాన కేంద్రాన్ని తీర్చిదిద్దారు.



అమలాపురంలోని కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న రైతులు, రైతు ప్రతినిధులు

ధాన్యం సొమ్ముల కోసం రోడ్డెక్కిన రైతులు

సొమ్ములు చెల్లించకుంటే పంట విరామమే.. కలెక్టరేట్ ఎదుట ధర్నా

అమలాపురం టౌన్, జూన్ 20: ఆర్బీకేల ద్వారా ప్రభుత్వానికి ధాన్యం విక్రయించి 60 రోజులు గడిచిపోయినా ఇంతవరకు ప్రభుత్వం సొమ్ములు చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ రైతులు గురువారం రోడ్డెక్కి ఆందోళన చేపట్టారు. తక్షణం ధాన్యం సొమ్ములు చెల్లించకుంటే పంట విరామం తప్పదని హెచ్చరిస్తూ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అమలాపురం, అయినవిల్లి, ఉప్పలగుప్తం, అల్లవరం మండలాలకు చెందిన రైతులు తక్షణం ధాన్యం సొమ్ములు చెల్లించాలని డిమాండు చేశారు. తొలకరి పంటకు పెట్టుబడులు పెట్టలేక, పాత అప్పులు తీర్చలేక, వడ్డీలు చెల్లించలేని పరిస్థితుల్లో తమకు పంట విరామమే శరణ్యమని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. రెండు, మూడు రోజుల్లోగా రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ చేయకపోతే క్రాప్ హాలిడే ప్రకటిస్తామని కలెక్టర్ హిమాన్షుశుక్లాకు వినతిపత్రం అందించారు. ఏటా ధాన్యం విక్రయించినప్పటికీ ఆలస్యంగానే సొమ్ములు జమవుతున్నాయని, ఆ పరిస్థితి లేకుండా చూడాలని కోరారు. రైతుల బ్యాంకు ఖాతాలకు సొమ్ములు జమకాకపోవడంపై సివిల్ సప్లయి అధికారులను కలెక్టర్ ప్రశ్నించారు. ఏప్రిల్ 25 నుంచి రైతుల ఖాతాలకు నగదు జమకాలేదని చెప్పడంతో ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి రైతుల సమస్య పరిష్కరిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. రైతు నేతలు అప్పారి వెంకటరమణ, బద్దే రామకృష్ణ, భైరిశెట్టి సుబ్రహ్మణ్యం, గుండుమోగుల దొరబాబు, కంకిపాటి శ్రీనివాసరావు, బొక్కా ఏడుకొండలు, వాకపల్లి శ్రీనివాస్, వర్రే సోమేశ్వరరావు, వర్రే వెంకటేశ్వరరావు, అప్పారి గోపాల్, దొరబాబు పాల్గొన్నారు.

రైల్వే ట్రాక్ పనులకు రూ.275 కోట్లు

అయినవిల్లి,జూన్20: కోటిపల్లి-నర్సాపురం రైల్వే లైన్‌లో భాగంగా గౌతమీ గోదావరి నదిపై ముక్తేశ్వరం-కోటిపల్లి వంతెన నిర్మాణంలో భాగంగా 44 పిల్లర్లు ఇప్పటికే పూర్తయ్యాయి. ఈ వంతెనపై డబుల్ లైన్, సూపర్ స్ట్రక్చర్, స్టీల్ ట్రాక్ నిర్మాణం చేపట్టడానికి అధికారులు తాజాగా చర్యలు చేపట్టారు. ప్రసాద్ కన్‌స్ట్రక్షన్స్, పేస్ సంస్థలు రూ.275 కోట్ల వ్యయంతో నిర్మించే పిల్లర్స్‌పై సూపర్ స్ట్రక్చర్ ట్రాక్ నిర్మాణం చేపట్టనున్నట్లు సమాచారం. గురువారం రైల్వే ఇంజనీర్లు, కాంట్రాక్టు సంస్థ ఇంజనీర్లు ముక్తేశ్వరం-కోటిపల్లి రైల్వే వంతెన వద్ద సర్వే చేశారు.



రెవెన్యూ ఉద్యోగులను సన్మానిస్తున్న జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా

రెవెన్యూశాఖ తల్లిలాంటిది : కలెక్టర్

అమలాపురం, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖలన్నింటిలో రెవెన్యూశాఖ తల్లి వంటిదని కలెక్టర్ హిమాన్షుశుక్లా పేర్కొన్నారు. భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడడం పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయడం, జనన మరణ ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయడం వంటి ఎన్నో కార్యక్రమాలను, ఇతర శాఖలను సమన్వయం చేసుకుని సామాన్య ప్రజలకు నిరంతరం అందించేదే రెవెన్యూశాఖేనని అన్నారు. కలెక్టరేట్‌లో రెవెన్యూ దినోత్సవం సందర్భంగా గురువారం రెవెన్యూ సిబ్బంది, రైతులతో కలిసి వేడుకలు నిర్వహించారు. పదవీ విరమణ చేసిన రెవెన్యూ ఉద్యోగులు విధి నిర్వహణలో అందించిన విశేష ప్రతిభను గుర్తించి 32 మంది ఉద్యోగులను కలెక్టర్ ప్రశంసా పత్రాలు అందజేసి దుశ్శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు. జేసీ ఎస్.నుపూర్ అజయ్ ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, ఆర్డీవో జి.కేశవర్ధనరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వి.మదనమోహన్‌రావు, ఏపీ రెవెన్యూ జేఏసీ చైర్మన్ వాసా ఎస్.దివాకర్, జిల్లా శాఖ అధ్యక్షుడు శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏవో సీహెచ్ వీరాంజనేయప్రసాద్‌లు పాల్గొన్నారు.



యోగా...
మానవులకు యోగం. మానసిక శుద్ధితో పాటు శారీరక శుద్ధి చేసి మనిషిని ఆరోగ్యవంతంగా ఉంచగలిగే శక్తి యోగాకు ఉంది. యోగాను ఒక యాగంగా భావిస్తే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవిస్తారనడంలో అతిశయోక్తి లేదు.

యోగా భారతీయ సంపద

శారీరక, మానసిక సమస్యలకు పరిష్కార మార్గాలు చూపే అద్భుత క్రియ

నేటి యాంత్రిక జీవనానికి దివ్యౌషధం

యోగాతో అందం..ఆరోగ్యం


ఆరోగ్యం అందాన్ని ఇస్తుంది. అందం ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. వీటన్నింటినీ యోగా ప్యాకేజీగా అందిస్తుంది. మహిళలు క్రమం తప్పకుండా యోగా చేస్తే చర్మాన్ని కాంతివంతం చేస్తుంది. శరీరాన్ని సరైన ఆకృతిలో పెడుతుంది. రోజంతా ఉత్సాహంగా, చురుగ్గా ఉంచుతుంది. రుతుక్రమం సరిగ్గా వచ్చేలా చూస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే రోజూ చేసే యోగా మహిళలను స్లిమ్ అండ్ ఫిట్‌గా మారుస్తుంది.

ప్రాణాయామం, ఆసనాలు, ధ్యానంతో అంతర్గత అవయవాలకు ఉత్తేజం అందుతుంది. తద్వారా రోగాలు పటాపంచలవుతాయి. ఆధునిక వైద్యం దారిచూపని అనేక సమస్యలకు పరిష్కారం చూపే మహత్తు ప్రాచీన భారతీయ యోగాకు మాత్రమే ఉంది. ఒకప్పుడు మహర్షులు, యోగులకు మాత్రమే పరిమితమైన యోగా ఇప్పుడు దైనందిన జీవితంలో భాగమైంది. మారుమూల పల్లెలకు సైతం యోగా విస్తరించింది. జిల్లాలో వందకు పైగా యోగాభ్యాస కేంద్రాలు పనిచేస్తున్నాయి.

మనిషిలోని అంతర్గత శక్తులను చైతన్యం చేసేది యోగా. శరీరంతో పాటు మనోబుద్ధులు అత్యుత్తమ స్థాయిలో పనిచేసేందుకు యోగా దోహదపడుతుంది. యోగం అనే పదానికి కలయిక అని అర్థం. గతంలో లేని దానిని పొందడం.. ఇది వరకు తెలియని దానిని తెలుసుకోవడమే యోగా పరమార్థం. యోగా అంటే ఆసనాలు వేయడం.. శరీరాన్ని అనేక రీతుల్లో వంచడం.. గాలిని బిగబట్టడం.. వంటివిగా భావిస్తారు. ఇవన్నీ యోగశాస్త్రంలో ప్రాథమిక అభ్యాసాలు మాత్రమే. వీటివల్ల శారీరక రుగ్మతలెన్నో దూరం చేసుకోవచ్చు. మానసిక ప్రశాంతతను పొందవచ్చు. ఒత్తిడిని అధిగమించి విజయంవైపు అడుగులు వేయవచ్చు.

ఉరుకుల పరుగుల ఆధునిక జీవన విధానంలో ప్రతిఒక్కరూ ఒత్తిడికి గురవుతున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల నుంచి ఉద్యోగులు, వ్యాపారులు.. ఇలా అన్ని రంగాల వారు ఒత్తిడితో కూడిన జీవితాన్ని గడపాల్సిన పరిస్థితి నెలకొంది. తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నవారు ఒక్కోసారి నేరాలకు పాల్పడడం, మరికొందరైతే ఆత్మహత్యాయత్నాలకు పాల్పడడం వంటి సంఘటనలు జరుగుతున్నాయి. మందులకు లొంగని మహమ్మారి ఒత్తిడిని మెలకువతో నియంత్రించే శక్తి యోగాకు ఉంది.

అమలాపురం రూరల్/తుని రూరల్:



అమలాపురంలో యోగాసనాలు

ఒక యోగం

శారీరక ఆరోగ్యానికి

శరీరం, మనసు ఒకదాంతో ఒకటి ముడిపడి ఉంటాయి. శారీరక ఆరోగ్యమే మిగతా ఆరోగ్యాలకు పునాది. ఎందుకంటే 75 శాతం వ్యాధులకు మనసే కారణమని ఆధునిక పరిశోధనల్లో తేలింది. ఆధునిక జీవన విధానంలో అధిక రక్తపోటు, నిద్రలేమి వంటివెన్నో ఉన్నాయి. సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రసాదించేలా పతంజలి మహర్షి యోగాసనాలకు అధిక ప్రాధాన్యతనిచ్చారు. యోగాలో ఎన్నెన్నో భంగిమలు. ఒక్కొక్కటి ఒక్కో శరీర భాగానికి ఆరోగ్యానిస్తుంది. వజ్రాసనం ఎసిడిటీని రూపుమాపుతుంది. శశాంకాసనం కాలేయ సమస్యలను దరిచేరనివ్వదు. భుజంగాసనం వెన్నునొప్పిని తగ్గిస్తుంది. వజ్రోలి లైంగిక శక్తిని పెంచుతుంది. వీటితో పాటు విద్యార్థులకు ఏకాగ్రతతో పాటు చక్కటి శరీర ఆకృతికి, బరువు తగ్గడానికి, నడుం, మెడ నొప్పి వంటివాటిని తగ్గించుకునేందుకు ఎన్నో ఆసనాలున్నాయి.



రకాలెన్నో..

ప్రాణాయామం చేయడం ద్వారా ప్రాణశక్తి పెరుగుతుందని విశ్వసించే వారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. అందుకే యోగాభ్యాసం పట్ల మక్కువ పెంచుకుని యోగా శిక్షణా తరగతుల వైపు పరుగులు తీస్తున్నారు. యువ యోగా, పవర్ యోగా, హఠయోగా, అరుణ యోగా.. లాఫింగ్ యోగా, డ్యాన్స్ యోగా, సైంటిఫిక్ యోగా.. ఇలా సరికొత్త రూపాలను సంతరించుకుంటూ "ఆరోగ్య మహాయోగా"న్ని ప్రసాదిస్తోంది. గతంలో ఎన్నడూలేనంతగా యోగాపై జరుగుతున్న ప్రచారంతో సాధన చేసేవారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది.

ప్రాణాయామానికి ప్రత్యేక స్థానం

యోగశాస్త్రంలో ప్రాణాయామానికి ప్రత్యేక స్థానం ఉంది. పూరక, కుంభక, రేచకాల ద్వారా శ్వాసను క్రమబద్ధీకరిస్తే శారీరక, మానసిక వికాసం సాధ్యం. భస్త్రిక మనసుమీద నియంత్రణ ఇస్తుంది. చెవి, ముక్కు, గొంతు సమస్యల నివారణకు ఉజ్జయి ఉపకరిస్తుంది. నాడీవ్యవస్థ పనితీరును నాడీశోధన మెరుగుపరుస్తుంది.

ఆరోగ్య ప్రదాయిని యోగా

శరీరశుద్ధితో పాటు మానసిక శుద్ధికోసం యోగా పితామహుడు పతంజలి మహర్షి అష్టాంగమార్గాన్ని ప్రజలకు అందించారు. యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార ప్రక్రియలు శారీరక శుద్ధికి ఎంతగానో ఉపకరిస్తాయి. ఇక ధారణ, ధ్యానం, సమాధిస్థితి మనసును శుద్ధిచేస్తాయి. వాటిని సాధన చేసే విధానాలను మహర్షి స్పష్టంగా వివరించారు. యోగా భారతీయ సనాతన విద్య. యోగశాస్త్రంలో ఎక్కడా దేవుని ప్రస్తావన ఉండదు. ఒకే ఒక సూత్రంలో మాత్రం సర్వజ్ఞుడైన వ్యక్తి అని మాత్రమే చెప్పారు. యోగా ఏ మత విశ్వాసానికి, ఏదో ఒక దేవునికి సంబంధించినది కాదు. ప్రపంచంలోని ప్రతి మనిషికీ శరీరం, ఇంద్రియాలు, మనసు ఒకటే.

డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు, యోగా గురువు, అమలాపురం



శ్రీప్రకాష్‌లో

యోగా దినోత్సవం

తుని రూరల్, జూన్ 20: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీ ప్రకాష్ విద్యా సంస్థలో యోగా దినోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల యోగాసనాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ యోగా ద్వారా జ్ఞాపక శక్తి మెరుగవుతుందని, మానసిక ప్రశాంతత కలుగుతుందని చెప్పారు. జాతీయ స్థాయి యోగా పోటీల్లో ప్రతిభ కనబరిచిన శ్రీ ప్రకాష్ విద్యార్థులు క్లిష్టమైన ఆసనాలు వేసి అందరిని ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం

రాజమహేంద్రవరం కల్చరల్ జూన్ 20: ఆర్థిక అక్షరాస్యతపై సమాజంలో ప్రతి ఒక్కరికీ కనీస అవగాహన కల్పించడమే ప్రత్యేక శిక్షణ తరగతుల ముఖ్యోద్దేశమని రిజర్వు బ్యాంకు జనరల్ మేనేజర్ ఆర్క్ మహన పేర్కొన్నారు. స్థానిక షెల్టన్ హోటల్‌లో గురువారం ఆర్థిక అక్షరాస్యతపై స్వయం సహాయక సంఘాల మహిళలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రతి మహిళ ఆర్థిక అక్షరాస్యతపై కనీస అవగాహన కలిగి ఉండాలన్నారు. డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ మూర్తి మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల మహిళలు బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్వయం సహాయక సంఘాలకు రుణాలు, సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమలు అందజేసే రుణ మంజూరు విధివిధానాలపై ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్‌వీవీఎస్ మూర్తి అవగాహన కల్పించారు. బ్యాంకులు అందజేసే పథకాలను ఎల్‌డీఎం వివరించారు.

'తూర్పుగోదావరి జిల్లా రాజకీయాలు' పుస్తకావిష్కరణ

దివాన్‌చెరువు, జూన్ 20: తూర్పుగోదావరి జిల్లా రాజకీయాలు 1952-2022 పుస్తకాన్ని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1952లో ఎన్నికలు ప్రారంభమైన నాటి నుంచి 2022 వరకూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పెద్ద జిల్లాగా తూర్పుగోదావరి జిల్లా పేరు పొందిందన్నారు. ఈ జిల్లా రాజకీయాలను నన్నయ విశ్వవిద్యాలయం రాజనీతిశాస్త్ర విభాగం విశ్రాంత ఆచార్యులు బీవీవీ బాలకృష్ణ రచనా సంకలనం చేశారని తెలిపారు. విశ్వవిద్యాలయంలోని అంబేడ్కర్ కేంద్ర గ్రంథాలయంలోని నన్నయ భారతి, నన్నయ అధ్యయన కేంద్రంలోని



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ పద్మరాజు తదితరులు

గ్రంథాలను ఉపయోగించుకుంటూ బాలకృష్ణ ఈ పుస్తక రూపకల్పనకు కృషి చేశారని అభినందించారు. నన్నయ భారతి ద్వారా ఈ పుస్తకాన్ని ప్రచురించినట్లు చెప్పారు. ప్రతులు కావలసిన వారు నన్నయ అధ్యయన కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. గత చరిత్రను, ఒకనాటి సంఘటనలను విస్మరించకుండా రాబోయే సమాజానికి అక్షరబద్ధం చేసి ఇవ్వగలిగితే చరిత్రలోని లోటుపాట్లు నేటి సమాజానికి మార్గదర్శకం అవుతాయన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, రచయిత బీవీవీ బాలకృష్ణ, సహాయకులు నన్నయ భారతి కోఆర్డినేటర్ పి.విజయనిర్మల, ప్రిన్సిపాల్ ఆచార్య డి.జ్యోతిర్మయి, అధ్యాపకులు ఆచార్య కేవీ రావు, ఆచార్య నరసింహారావు, కె.రాజరాజేశ్వరీదేవి తదితరులు పాల్గొన్నారు.

'విజయవంతంగా జేఎన్టీయూకే బృందం అమెరికా పర్యటన'

జేఎన్టీయూకే, జూన్ 20: పూర్వవిద్యార్థుల సంబంధాలను మెరుగుపర్చడం ద్వారా ఉన్నతవిద్యనభ్యసించేందుకు అమెరికా వెళ్లే విద్యార్థులకు ఉత్తమ మార్గదర్శకం లభిస్తుందని జేఎన్టీయూకే ఉపకులపతి ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు తెలిపారు. విదేశాల్లో స్థిరపడిన జేఎన్టీయూకే పూర్వవిద్యార్థులను వర్సిటీ అభివృద్ధిలో భాగస్వాములను చేసేందుకుగాను వారి ఆహ్వానం మేరకు వీసీ ప్రసాదరాజు, యూసీఈకే ప్రిన్సిపాల్ ఎంహెచ్ఎం కృష్ణప్రసాద్, జేవీఆర్ మూర్తిలతో కూడిన ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం చేపట్టిన అమెరికా పర్యటన విజయవంతం అయ్యిందన్నారు. అక్కడ చేపట్టిన కార్యక్రమాలను వీసీ వివరించారు. యూఎస్ విశ్వవిద్యాలయాలతో కలిసి ప్రస్తుత సాంకేతికతకు అనుగుణంగా సంయుక్తంగా ఎంఎస్ ప్రోగ్రాంలు నిర్వహించేందుకు తగిన చర్యలు చేపడతామన్నారు. సంయుక్త నిధుల కోసం దరఖాస్తు చేసేందుకు మిస్సోరి వర్సిటీతో చర్చలు జరిపామని, గతంలో ఇదే విశ్వవిద్యాలయంతో పార్టనర్‌షిప్-2020 గ్రాంట్‌ను 2020-22 మధ్య విజయవంతంగా అమలు చేసి అమెరికా ప్రభుత్వం నుంచి ఎక్సలెన్స్ సర్టిఫికెట్ పొందారని అన్నారు. 2015-2019 వరకూ చికాగో స్టేట్ యూనివర్సిటీతో కలిసి ఒబామాసింగ్ ఇనిషియేటివ్ గ్రాంట్స్‌ను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. వర్సిటీలో విద్యా వాతావరణాన్ని మరింత మెరుగుపరిచేందుకు కాలిఫోర్నియాకు చెందిన పూర్వవిద్యార్థులు తమవంతు సహకారం అందించడం అభినందనీయమన్నారు. యూనివర్సిటీకి న్యాక్ ఏ+ కళాశాలకు ఎన్‌బీఏ గుర్తింపు లభించడం విద్యార్థులు మెరుగైన ప్యాకేజీలతో ప్లేస్‌మెంట్స్ పొందడం పట్ల ఆనందం వ్యక్తం చేశామన్నారు. సీఎస్‌యూతో కలిసి కొలాబొరేటివ్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రాం నిర్వహించేందుకు సీఎస్‌యూ ఉన్నతాధికారులతో సమావేశమై కోర్సు రూపకల్పనకు చర్చలు జరిపినట్లు తెలిపారు. వర్సిటీ ప్లాటినం జూబ్లీ, అలూమ్ని సెంటర్ నిర్మాణానికి పూర్వవిద్యార్థులనుంచి విరాళాలు సేకరించడంలో కీలకపాత్ర పోషిస్తున్న సీతా, ముత్యాల భాస్కర్‌రావును బృందం తరపున కలిసి కృతజ్ఞతలు తెలిపామన్నారు. పూర్వవిద్యార్థులైన పారిశ్రామికవేత్తలతో సమావేశమై ఏఐలో ఇంటర్న్‌షిప్ అందించేందుకు ముందుకువచ్చిన పూర్వవిద్యార్థి డాక్టర్ వాసును అభినందించినట్లు తెలిపారు.

జేఎన్టీయూకే ఫార్మా డీ ప్రశ్నపత్రంలో గందరగోళం

జేఎన్టీయూకే, జూన్ 20: కాకినాడ జేఎన్టీయూకే పరిధిలో 14 కళాశాలలకు సంబంధించి 12 కేంద్రాల్లో ఫార్మాడీ కోర్సు ద్వితీయ సంవత్సరం పరీక్షలను నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం 10గంటలనుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ నిర్వహించిన ఫార్మా థెరాప్యూటిక్స్-1 పరీక్షాపేపర్‌లో ఇదే కోర్సుకు సంబంధించిన తృతీయ సంవత్సర సిలబస్‌నుంచి 4 ప్రశ్నలు, 1 బిట్ వచ్చాయని తెలుసుకున్న విద్యార్థులు గందరగోళానికి గురై ఆందోళన చేశారు. విద్యార్థులంతా అధ్యాపకులను ప్రశ్నించగా పరీక్ష ముగిసే అరగంట ముందు 4 ప్రశ్నలు, ఒక బిట్‌ను ద్వితీయ సంవత్సర సిలబస్ నుంచి ఇచ్చి పరీక్షా సమయాన్ని ఒక గంట పెంచారు. దీనిపై వర్సిటీ పరీక్షల విభాగం డీఈ బి.బాలకృష్ణను వివరణ కోరగా ప్రశ్నలు తృతీయ సంవత్సరం సిలబస్ నుంచి రావడం వాస్తవమేనని విద్యార్థులు నష్టపోకుండా సమస్యను వెంటనే గుర్తించి ప్రశ్నలు మార్చి వాటిని రాసేందుకు సమయాన్ని పెంచామని కాబట్టి విద్యార్థులు యథావిధిగా పరీక్షలు రాశారని, వారు ఎలాంటి ఆందోళన చెందనక్కర్లేదని తెలిపారు.

నేడు అంతర్వేదిలో సప్తనదీ జలాల మహా జ్యేష్ఠాభిషేకం

అంతర్వేది, జూన్ 20: అంతర్వేదిలో కొలువైయున్న శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో సప్తనదీ జలాల మహా జ్యేష్ఠాభిషేకానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సహాయ కమిషనరు వి.సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగే ఈ క్రతువులో పాల్గొనదలచిన భక్తులు రూ.400 టిక్కెట్ తీసుకోవాలన్నారు. మహా శాంతి హోమం కూడా జరుపుతామని అర్చకులు చెప్పారు.

యోగా, వెల్‌నెస్ ఫెస్టివల్ ప్యానల్ సభ్యునిగా సాంబశివరావు

అమలాపురం టౌన్, జూన్ 20: ముంబైలో ధార్తి, హబీబీటీ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా, వెల్‌నెస్ ఫెస్టివల్‌కు దేశ, విదేశాల నుంచి 1200కు పైగా వైద్యులు, ప్రతినిధులు హాజరయ్యారు. 11 మంది సభ్యులతో జాతీయ స్థాయిలో ఏర్పాటుచేసిన ప్యానల్‌లో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి అమలాపురం పట్టణానికి చెందిన చిక్కం సాంబశివరావును మాత్రమే ఎన్నుకున్నారు. ఎకో వారియర్స్, లివింగ్ గ్రీన్ ఎవ్రీడే తదితర అంశాలపై సాంబశివరావు జాతీయ స్థాయి సదస్సులో చర్చించారు. లీడ్ ది లైవ్స్ సీఎఫ్ శాంతిస్వరూప్ తదితరులు సాంబశివరావును అభినందించారు.

డాలర్లు దోచేశారు!



స్వాధీనం చేసుకున్న డాలర్లు

అధిక మొత్తం ఆశ చూపి డాలర్లతో ఉడాయించిన ముఠా

ఆరుగురి అరెస్ట్.. మరో ఐదుగురి కోసం గాలింపు

రాజమహేంద్రవరం, జూన్ 20 (ఆంధ్రజ్యోతి) : అమెరికా వెళ్లి డాలర్లు సంపాదించి తెచ్చుకున్నారు. కానీ అత్యాశతో ఓ ముఠా చేతికి దొరికిపోయారు. కేసు వివరాలను అడిషనల్ ఎస్పీ(క్రైమ్స్) టి.సర్కార్ గురువారం వెల్లడించారు. విశాఖపట్నానికి చెందిన వెలగల శివ శంకరరెడ్డి 50 వేల అమెరికన్ డాలర్లను భారత కరెన్సీలోకి మారకం చేసుకునే క్రమంలో విశాఖకు చెందిన కర్రి కనకరాజుతో పరిచయం ఏర్పడింది. తమకు డాలర్లు ఇస్తే భారత కరెన్సీలో డాలరుకు రూ.98 ఇస్తామని ఆశచూపారు. దీంతో బేరం కుదిరింది. మే నెల 30న దేవరపల్లి మండలం గౌరీపట్నం గ్రామంలోని జడ్పీ హైస్కూల్ వద్దకు శంకరరెడ్డి డాలర్లు తీసుకొని వెళ్లారు. అక్కడికి కనకరాజుతో పాటు మరో పది మంది వచ్చి డాలర్లు ఉన్న బ్యాగ్‌ని లాక్కుపోయారని అడిషనల్ ఎస్పీ తెలిపారు. ఈ కేసులో విశాఖకు చెందిన కనకరాజు, విజయనగరానికి చెందిన గణగల్ల అజయ్‌కుమార్, అల్లూరి జిల్లా సీలేరుకు చెందిన వంతల విష్ణు, పల్నాడు జిల్లా మల్లాది గ్రామానికి చెందిన సొంగా రమేశ్, విజయవాడకు చెందిన ఉడత రవితో సహా ఆరుగురిని గురువారం అరెస్టు చేసి 36 వేల డాలర్లు, ఇన్నోవా కారు, హోండా అమేజ్ కారు, 8 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మరో ఐదుగురి కోసం గాలింపు చేపట్టామని తెలిపారు. అయితే పోలీసుల వివరణపై పలు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇండియన్ కరెన్సీలో సుమారు రూ.41 లక్షలకు సంబంధించిన భారీ నేరం విషయంలో ఏదో దాస్తున్నారనే అనుమానాలు ఉన్నాయి. నిందితులుగా పేర్కొన్న వారిలో అందరూ వివిధ జిల్లాలకు చెందినవాళ్లు. ఉదాహరణకు ఎక్కడో పల్నాడు జిల్లా ఒకరిదైతే ఇక్కడి అల్లూరి జిల్లా మరొకరిది. దీంతో వీళ్లందరూ ముఠాగా ఎలా ఏర్పడ్డారనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. అలాగే శంకర్ రెడ్డికి అంత పెద్ద మొత్తంలో 50 వేల అమెరికన్ డాలర్లు ఎలా వచ్చాయనే స్పష్టత కూడా కొరవడింది. శంకర్ రెడ్డిది విశాఖ జిల్లా, నిందితులవి వివిధ ప్రాంతాలు. దేవరపల్లిలో దాడి ఎలా జరిగిందో వివరణ లేదు. దీంతో ఈ కేసు విషయంలో నిజాలు బయటకు రావాల్సిన అవసరం కనిపిస్తోంది.



మరమ్మతులు నిర్వహిస్తున్న దృశ్యం

ఓఎన్జీసీ బావిలో మరమ్మతులు

మలికిపురం, జూన్ 20: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం తూర్పుపాలెం సముద్ర తీరంలోని కేశనపల్లి వెస్ట్ 38 ఓఎన్జీసీ ఆయిల్ కంపెనీ గ్యాస్ బావిలో సాంకేతిక సమస్య తలెత్తింది. ఈ బావి నుంచి కొన్ని రోజులుగా గ్యాస్ రావట్లేదు. దీంతో గురువారం తూర్పుపాలెంలోని సీసీఎస్ సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. కేశనపల్లి వెస్ట్ స్ట్రక్చర్ పరిధిలో అత్యధికంగా గ్యాస్ ఉత్పత్తి జరుగుతున్న బావులు ఇక్కడే ఉన్నాయి. రెండేళ్ల క్రితం మరమ్మతులు చేసినప్పుడు భారీ ఎత్తున గ్యాస్ ఆయిల్ లీకై పెను ప్రమాదం తప్పింది. అప్రమత్తమైన ఉన్నతాధికారులు ఈసారి అధునాతన యంత్ర పరికరాలను తెచ్చి బావులను బాగు చేస్తున్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి



బోరున విలపిస్తున్న భార్య

అంబాజీపేట, జూన్ 20: వ్యవసాయంలో కూలి పని చేసేందుకు వెళ్తున్న ఓ వ్యక్తిని కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం కముజువారిలంక గ్రామానికి చెందిన విత్తనాల నాగేశ్వరరావు (58) భార్య వెంకటలక్ష్మీతో కలిసి గురువారం మధ్యాహ్నం పొలం పనికి బయల్దేరాడు. ఈ సమయంలో ముక్కామల నుంచి కొత్తపేట వైపు వెళ్తున్న స్విఫ్ట్ డిజైర్ కారు నాగేశ్వరరావును వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. స్థానికులు 108కు సమాచారం అందించారు. సిబ్బంది అక్కడికి చేరుకుని పరీక్షించగా నాగేశ్వరరావు మృతి చెందినట్టు నిర్ధారించారు. నాగేశ్వరరావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అంబాజీపేట పోలీసులు కేసు నమోదు చేశారు.

అత్యాచారం కేసులో 20 ఏళ్ల జైలు

రంపచోడవరం, జూన్ 20: బాలికకు మాయమాటలు చెప్పి అత్యాచారానికి పాల్పడిన కేసులో ముద్దాయికి కాకినాడ స్పెషల్ పోక్సో కోర్టు జడ్జి కొండపల్లి శ్రీదేవి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షను ఖరారు చేస్తూ తీర్పును వెలువరించినట్లు ఎస్ఐ మోహన్ కుమార్ తెలిపారు. అల్లూరి జిల్లా వై.రామవరం మండలంలో ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలికను రంపచోడరంలో నివాసం ఉంటున్న మద్దికొండ సుధాకర్ మాయమాటలు చెప్పి లోబర్చుకున్నాడు. తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఏఎస్పీ వకుల్ జిందాల్ ముద్దాయిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. కేసులో సాక్ష్యుల వాంగ్మూలం ఆధారంగా జడ్జి కిడ్నాప్ నేరం కింద 6 నెలల సాధారణ జైలుశిక్ష, రూ.1000లు జరిమానా, పోక్సో చట్టం ప్రకారం 20 సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష, రూ.5000 జరిమానా విధించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ పితాని శ్రీనివాసరావు కేసును వాదించారు.

దేవదాయ మంత్రిని కలిసిన రత్నగిరి బృందం

అన్నవరం, జూన్ 20: రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రిగా గురువారం బాధ్యతలు స్వీకరించిన ఆనం రాంనారాయణరెడ్డిని అన్నవరం దేవస్థానం ఈవో రామచంద్ర మోహన్, చైర్మన్ రోహిత్ ఇతర అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు ఈవో స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. అన్నవరం ఆలయంలో చేపడుతున్న అభివృద్ధి పనులను మంత్రి ఈవోను అడిగి తెలుసుకున్నారు. డిప్యూటీ కమిషనర్ రమేష్‌బాబు, సహాయ కమిషనర్ విశ్వనాథరాజు పాల్గొన్నారు.



మంత్రికి స్వామివారి చిత్రపటం అందిస్తున్న అధికారులు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

•అమలాపురం •పి.గన్నవరం •రాజోలు •ముమ్మిడివరం •కొత్తపేట •మండపేట •రామచంద్రపురం



జోగేశ్వరరావును సత్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు

ఎమ్మెల్యే విజేత వేగుళ్లకు సత్కారం

మండపేట, జూన్ 20: మండపేట ఎమ్మెల్యే విజేత వేగుళ్ల జోగేశ్వర రావును బీజేపీ యువ నేత కంకటాల మురళీకృష్ణ సారథ్యంలో ద్వారపూడికి చెందిన ఆర్యవైశ్య సంఘ నాయకులు వాకచర్ల నాగ భాస్కరరావు, బొండాడ సీతారామయ్య, నాగబాబు, గిరిబాబు, నరేష్, శ్రీనివాస్ గురువారం కలిసి పూలమాలలతో సత్కరించారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలో నెం.1గా తీర్చిదిద్దాలని వారు కోరారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు యరగతపు బాబ్జీ వున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజేత వరప్రసాద్

హామీల పరిష్కారానికి చర్యలు

రాజోలు ఎమ్మెల్యే విజేత దేవ వరప్రసాద్

మలికిపురం, జూన్ 20: నియోజకవర్గంలో ఇచ్చిన హామీల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని రాజోలు ఎమ్మెల్యే విజేత దేవ వరప్రసాద్ అన్నారు. మలికిపురం ఎల్ఎస్‌ల్యాండ్ మార్కులో గురువారం జరిగిన రాజోలు, మామిడికుదురు మండలాల టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంచినీటి సమస్యను తీరుస్తానని, ఇప్పటికే ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో మాట్లాడి అంచనాలు సిద్ధం చేయమన్నానని చెప్పారు. కొబ్బరి రైతుల సమస్యలు, పంట కాల్వలు, రహదారులు సమస్యల పరిష్కారం దిశగా ముందుకెళ్తానన్నారు. రాజోలు ఎంపీపీ కేతా శ్రీను, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్, గుండుబోగుల పెదకాపు, చాగంటి స్వామి, సూరిశెట్టి శ్రీనివాస్, కసుకుర్తి త్రినాథస్వామి, మోకా పార్వతి, జాంబవతి, రత్నమాల, పిల్లి శ్రీరామమూర్తి, కాంగ్రేగుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.





ఉప ముఖ్యమంత్రి పవన్‌కు పెయింటింగ్ బహూకరిస్తున్న ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, మంత్రి సుభాష్‌ను సత్కరిస్తున్న దృశ్యం

ఏపీ మంత్రులను కలిసిన యానాం ఎమ్మెల్యే

యానాం, జూన్ 20: ఏపీ కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. అనంతరం హోం మంత్రి వంగలపూడి అనిత, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, జనసేన నాయకుడు కొణిదల నాగబాబులను కలిశారు. ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్‌కల్యాణ్‌ను కలిసి చిరు, పవన్ చిత్రాలతో కూడిన పెయింటింగ్ అందజేశారు. యానాంకు సంబంధించిన పలు అంతర్ రాష్ట్ర సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లగా అన్ని విధాలా సహకారం అందజేస్తామని హామీ ఇచ్చినట్టు ఎమ్మెల్యే గొల్లపల్లి మీడియాకు వివరించారు.

పిల్లలను విధిగా బడిలో చేర్పించాలి

ఉప్పలగుప్తం, జూన్ 20: తల్లిదండ్రులు తమ పిల్లలను విధిగా పాఠశాలలో చేర్పించాలని ఎంపీడీవో కొరారి వెంకటేశ్వరప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని గ్రామాల్లో విద్యా శాఖ ఆధ్వర్యంలో 'నేను బడికి పోతా' కార్యక్రమం నిర్వహించారు. బడి బయట పిల్లలుంటే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఎంఈవో సత్తి సత్యకృష్ణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. బి.జాన్‌బాబు, ఎన్.గంగాధరరావు, వెంకట్, అంగన్‌వాడీ సిబ్బంది, సీఆర్పీలు పాల్గొన్నారు.

పి.గన్నవరం: మండలంలోని ఆర్.ఏనుగుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'నేను బడికి పోతా' ర్యాలీ నిర్వహించారు. కాంప్లెక్సు పరిధిలోని విద్యార్థులకు ఎంఈవో కె.హెలీనా అవగాహన కల్పించారు. ఎంఈవో-2 సీహెచ్ వీరభద్రనందన్, ప్రధానోపాధ్యాయుడు బి.చిరంజీవి, సీఆర్ఎంటీ ఎం.అర్జున్, ఆదిబాబు, ఎం.అనూషదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాత్రేనికోన: విద్యాప్రవేశ్ కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యాలని సమగ్ర శిక్షా ఏఎంవో పి.రాంబాబు విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన చిర్ర యానాం ప్రాథమిక పాఠశాలలో విద్యాప్రవేశ్ కార్యక్రమ అమలు తీరును పరిశీలించారు. ఒకటో తరగతి విద్యార్థులకు 90 రోజుల పాటు రోజుకు రెండు గంటలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో కేటీవీఎస్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్ల జిల్లా కార్యవర్గం

అమలాపురం రూరల్, జూన్ 20: అమలాపురం మండల పరిషత్ కార్యాలయంలో ఈవోపీఆర్డీ, ఎన్నికల అధికారి జి.మల్లికార్జునరావు ఆధ్వర్యంలో జిల్లా స్థాయి డేటా ఎంట్రీ ఆపరేటర్ల సంఘ ఎన్నికలను గురువారం నిర్వహించారు. అధ్యక్షునిగా కేపీ రాజేష్ (పి.గన్నవరం), ఉపాధ్యక్షునిగా కె.వెంకటేశ్వరరావు (కపిలేశ్వరపురం), కార్యదర్శిగా వై.హిమబిందు (అయినవిల్లి), కోశాధికారిగా వైఎస్ఎస్వీ ప్రసాద్ (మామిడికుదురు), సంయుక్త కార్యదర్శిగా కేవీవీ సత్యనారాయణ (కె.గంగవరం), కార్యనిర్వాహక కార్యదర్శులుగా జి.నాగార్జున (రాజోలు), కె.శ్రీనివాస్ (అమలాపురం), రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా పి.రమేష్ (అల్లవరం), జి.శ్రీనివాసరావు (కొత్తపేట), కేఎస్వీడీ మహాలక్ష్మి (ఆలమూరు), సభ్యులుగా ఎస్.సాయిబాబు, జె.నాగేశ్వరరావు, ఎం.మౌనిక, ఎస్.దిలీప్‌లను ఎన్నుకున్నారు.

యోగాపై అవగాహన ర్యాలీ

మామిడికుదురు, జూన్ 20: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మామిడికుదురు కేతన్ యోగా సెంటర్ ఆధ్వర్యంలో యోగాపై అవగాహన కల్పిస్తూ గురువారం ర్యాలీ నిర్వహించారు. యోగా మాస్టర్ కేతన్ ఆకుల ఆధ్వర్యంలో మామిడికుదురు సెంటరు నుంచి నగరం వరకు నాలుగు కిలోమీటర్ల మేర ప్లకార్డులతో ప్రదర్శన జరిపి యోగా వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు తెలియజెప్పారు. యోగా సాధకులు మెండా ఆదినారాయణ, కోట బ్రహ్మానందం, నయినాల రఘురామయ్య, కడలి నూకరాజు, బత్తుల శ్రీదేవిశ్రీనివాస్, అరుణ, నానాజీ, కంచి నాగరాజు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరమణ	: మనమే
శ్రీలలిత	: మహారాజ
శేఖర్ స్క్రీన్-1	: నింద
శేఖర్ స్క్రీన్-2	: అంతిమ తీర్పు
రమా	: ప్రభుత్వ జూనియర్ కళాశాల
గణపతి	: రాజధాని రౌడీ
వెంకటపద్మావతిస్క్రీన్-1	: హరోంహర
వెంకటపద్మావతి స్క్రీన్-2	: భజే వాయువేగం

మంత్రులను కలిసిన సాయిబాబు

ముమ్మిడివరం, జూన్ 20: రాష్ట్ర రెవెన్యూ మంత్రి ఎ.సత్యప్రసాద్, ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడులను సర్వే ఉద్యోగుల సంఘ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాసరి సాయిబాబు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో సర్వే ఉద్యోగుల సమస్యలను మంత్రులకు వివరించారు.

నేడు యోగా దినోత్సవం

యానాం: జీఎంసీ బాలయోగి క్రీడా ప్రాంగణంలోని వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియంలో యోగా దినోత్సవం నిర్వహిస్తామని పరిపాలనాధికారి మునిస్వామి తెలిపారు. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ హాజరవుతారని చెప్పారు.

ప్రతి నీటిబొట్టూ ప్రాణప్రదమే

అంతర్వేది, జూన్ 20: సఖినేటిపల్లి మండలం సఖినేటిపల్లిలంక హైస్కూలులో నేషనల్ గ్రీన్‌కోర్ స్టేట్ మోనిటరింగ్ అధికారి గండేపల్లి ప్రభావతి ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులకు పర్యావరణ దినోత్సవంపై అవగాహన కల్పించారు. పాఠశాలలు, నివాసాల్లో నీటి దుర్వినియోగాన్ని అరికట్టాలని, ప్రతి నీటిబొట్టును ప్రాణపదంగా భావించాలన్నారు. విద్యార్థులకు ఎంఈవో కిశోర్ కుమార్ నీటి ఆవశ్యకతను వివరించారు. నీటిని పొదుపు చేయండి... సహజ వనరులను కాపాడండి... నీరు మానవాళికి జీవనాధారం.. నీటిని వృథా చేయవద్దంటూ నినాదాలు చేస్తూ గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు.

రాజోలు: జల పొదుపుపై విద్యార్థులతో పాటు ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, నీరు లేనిదే మానవ మనుగడ లేదు కాబట్టి నీటిని పొదుపుగా వాడాలని డిప్యూటీ కలెక్టర్ మధుసూదనరావు పేర్కొన్నారు. పర్యావరణ వారోత్సవాల్లో భాగంగా చివరి రోజైన గురువారం రాజోలు బాలికల ఉన్నత పాఠశాలలో జల పొదుపుపై ఎంఈవో ఎస్.మనోహరం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నీటి పొదుపుపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎంఈవో-2 ప్రసాదరావు, హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమలాపురం టౌన్: నీటిని పొదుపుగా వాడి భవిష్యత్తు తరాల వారికి నీటికొరత లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని సమగ్ర శిక్షా ఏపీసీ ఎ.మధుసూదనరావు సూచించారు. అమలాపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 'సేవ్ వాటర్.. సేవ్ లైఫ్' నినాదంతో చేపట్టిన ర్యాలీలో విద్యార్థులతో కలిసి ఆయన పాల్గొన్నారు. సేవ్ వాటర్ కార్యక్రమ లక్ష్యాలను విద్యార్థులకు వివరించారు.



సఖినేటిపల్లిలంకలో మానవహారంగా ఏర్పడ్డ విద్యార్థులు

నీటిని వృథా చేయకుండా మొక్కలు పెంచే విధానం, పర్యావరణాన్ని కాపాడుకోవలసిన బాధ్యత గురించి తెలియజెప్పారు. హెచ్ఎం ఎస్.రాజరాజేశ్వరి, ఆర్.సుబ్రహ్మణ్యేశ్వరరావు, కె.బాలకృష్ణ, వై.జ్యోతి, టీఎస్‌వీఎస్ సూర్యనారాయణమూర్తి, కేవీఎస్ శర్మ, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నామన రాంబాబు

24న ర్యాలీ, అభినందన సభ

విజయవంతానికి కూటమి నాయకులు కృషి చేయాలి: నామన

పి.గన్నవరం, జూన్ 20: నియోజకవర్గ ప్రధాన కేంద్రమైన పి.గన్నవరంలో ఈ నెల 24న జరిగే విజయోత్సవ ర్యాలీ, అభినందన సభలను విజయవంతం చేయడానికి కూటమి నాయకులు కృషి చెయ్యాలని టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు పిలుపునిచ్చారు. జనసేన క్యాంపు కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే విజేత గిడ్డి సత్యనారాయణ విజయోత్సవ ర్యాలీ గంటి పెదపూడి వద్ద ప్రారంభమై పి.గన్నవరం మూడు రోడ్ల కూడలి వరకు సాగుతుందన్నారు. అనంతరం అమలాపురం రోడ్డులో పోతవరం హ్యాండాయ్ షోరూమ్ చెంతనే గల లే-అవుట్‌లో అభినందన సభ జరుగుతుందన్నారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, సమన్వయ కమిటీ సహ కన్వీనర్ దాసరి వీర వెంకట సత్యనారాయణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మద్దాల సుబ్రహ్మణ్యం, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ చీకరుమిల్లి వెంకటేశ్వరరావు, జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగినీడి వెంకటేశ్వరరావు, కార్యదర్శి వాసంశెట్టి కుమార్, మొల్లేటి శ్రీనివాసరావు, సాధనాల శ్రీవెంకట సత్యనారాయణ, చిట్టూరి శ్రీనివాస్, దొమ్మేటి సాయికృష్ణ, నేదునూరి వీర్రాజు, గణపతి వీరరాఘవులు, సంసాని పెద్దిరాజు, బొంతు పెదబాబు, యల్లమిల్లి కృష్ణవేణి, గుడాల రాముడు, పసలపూడి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే విజేత సుబ్బరాజును అభినందిస్తున్న అనాతవరం గ్రామ ప్రజలు

గ్రామాల అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే విజేత సుబ్బరాజు

ముమ్మిడివరం, జూన్ 20: నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను అభివృద్ధిలో ముందుంచుతానని ఎమ్మెల్యే విజేత దాట్ల సుబ్బరాజు పేర్కొన్నారు. అనాతవరానికి చెందిన పలువురుసర్పంచ్ మిమ్మితి చిరంజీవి ఆధ్వర్యంలో గురువారం క్యాంపు కార్యాలయంలో సుబ్బరాజును మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. నాయకులు గుత్తుల సాయి, దాట్ల పృథ్వీరాజ్, శివరాజు, కుడుపూడి శ్రీనివాసరావు, మట్టపర్తి శ్రీరామచంద్రమూర్తి, పాటి సత్యవతి, పెయ్యల వరప్రసాద్, పెట్టా శ్రీలక్ష్మి, బుడితి సత్యవేణి, కర్రి నాగమల్లేశ్వరి, మోరం భవానీ తదితరులు పాల్గొన్నారు.

ధర్మోజీరావు సేవలు చిరస్మరణీయం

రాజోలు, జూన్ 20: సాహిత్య రంగంలో డాక్టర్ గుర్రం ధర్మోజీరావు సేవలు చిరస్మరణీయమని రాజోలు వైస్ ఎంపీపీ పోలమూరి శ్యామ్‌బాబు అన్నారు. తాటిపాకలో దళిత చైతన్య వేదిక ఆధ్వర్యంలో గురువారం ధర్మోజీవురావు సంస్మరణ సభ జరిగింది. ధర్మోజీరావు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన 15 మంది ప్రముఖులకు ధర్మోజీరావు స్మారక పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో దళిత చైతన్య వేదిక వ్యవస్థాపకుడు బత్తుల మురళీకృష్ణ, చిలకపాటి శ్రీధర్, బత్తుల జనార్దనరావు, తెన్నేటి నాగేశ్వరరావు, చుట్టుగుళ్ల సత్యనారాయణ, భూపతి వెంకటపతి, నీతిపూడి చంద్రరావు, కోట రామ్మోహనరావు, దీపాటి శివప్రసాద్, చోడదాసు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రామోజీరావుకు నివాళి

ఆత్రేయపురం, జూన్ 20: అంకంపాలెంలో ఈనాడు గ్రూపు సంస్థల చైర్మన్ చెరుకూరి రామోజీరావు సంస్మరణ సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కొత్తపేట నియోజకవర్గ కాకతీయ కమ్మ సంఘం అధ్యక్షుడు దొడ్డపనేని త్రినాథరావు, మాజీ సర్పంచ్ కరుటూరి నరసింహారావు, టీడీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు కుడప కృష్ణమూర్తి, సర్పంచ్ ముత్యాబత్తుల రాజు పాల్గొన్నారు.

పీఎంపీ వైద్యుడు రాజా మృతి

మండపేట, జూన్ 20: పట్టణానికి చెందిన పీఎంపీ వైద్యుడు మంగిపూడి రాజా భాస్కర్ (55) అనారోగ్యంతో గురువారం ద్రాక్షారామలో కన్నుమూశారు. గాంధీనగర్‌కు చెందిన ఈయన 45 సంవత్సరాలుగా ప్రజలకు వైద్య సేవలందిస్తున్నారు. రాజాకు భార్య, కుమారుడు, కుమార్తె వున్నారు. ఆయన మృతికి పీఎంపీల సంఘం జిల్లా అధ్యక్షుడు కోన సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు బళ్ల వెంకటరమణ, ఎం.సత్యనారాయణ, వానపల్లి కనకరాజు, ఇందన వెంకటేశ్వరరావు, యిమ్మంది నాగరాజు, బాలాజీ సంతాపం వ్యక్తం చేశారు. రాజా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి

మలికిపురం, జూన్ 20: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని పంచాయతీల్లో డీఈవోలుగా పనిచేస్తున్న పలువురు రాజోలు ఎమ్మెల్యే విజేత దేవ వరప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి, మామిడికుదురు మండలాల చౌక దుకాణాల డీలర్లు ఎమ్మెల్యే విజేత వరప్రసాద్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. దుశ్శాలువాతో సన్మానించారు. రాజోలు నియోజకవర్గ ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది దేవను మర్యాదపూర్వకంగా కలిశారు.

వాటర్ ట్యాంకులను నిరంతరం పర్యవేక్షించాలి

పి.గన్నవరం, జూన్ 20: పంచాయతీల్లో తాగునీరు అందించే వాటర్ ట్యాంకులను నిరంతరం పర్యవేక్షించాలని డీఎల్పీవో పి.బొజ్జిరాజు కార్యదర్శులకు సూచించారు. గురువారం ఆయన పి.గన్నవరం, బీవీ పాలెం, ముంగండ, పోతవరం, రాజులపాలెం, నరేంద్రపురం, గంటి పెదపూడి గ్రామాల్లో వాటర్ ట్యాంకులను ఆయన పరిశీలించారు. ఈవోపీఆర్డీ ఉమామహేశ్వరావు, కార్యదర్శులు లక్ష్మీనారాయణ, వర్మ, కొప్పిశెట్టి వెంకటరమణ, పలు గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మంత్రి సుభాష్‌కు అభినందనలు

కె.గంగవరం, జూన్ 20: కార్మిక శాఖ మంత్రి బాధ్యతలు స్వీకరించిన వాసంశెట్టి సుభాష్‌కు మండల నాయకులు అభినందనలు తెలిపారు. రవ్వా భూషణం, రిమ్మలపూడి సుమన్, కొత్తపల్లి మొరార్జీ తదితరులు సుభాష్‌కు పుష్పగుచ్ఛాలు ఇచ్చారు.

అధికారుల తీరుపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం

ఆత్రేయపురం, జూన్ 20: గ్రామాల్లో నెలకొన్న వివిధ సమస్యలను ప్రజాప్రతినిధులు ఏకరువు పెట్టారు. ఆత్రేయపురం మండల పరిషత్ సమావేశాన్ని ఎంపీపీ కుండా అన్నపూర్ణ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. గ్రామాల్లో లో ఓల్టేజ్ సమస్య అధికంగా ఉన్నా అధికారులు పట్టించుకోవట్లేదని అంకంపాలెం సర్పంచ్ ముత్యాబత్తుల రాజు మండిపడ్డారు. లొల్ల, మెర్లపాలెం పరిధిలో సుమారు 200 ఎకరాల పంట భూములు ముంపునకు గురై ఆకుమడులు కుళ్లిపోతున్నాయని, రైతులు ఆందోళన పట్టడం లేదంటూ మెర్లపాలెం సర్పంచ్ మెర్ల శ్రీరామచంద్రమూర్తి ఇరిగేషన్ అధికారులపై మండిపడ్డారు. ముక్తేశ్వరం బ్యాంకు కెనాల్ కాలువ నీటి మట్టాన్ని తగ్గించాలని విన్నవించుకున్నా అధికారులు పట్టించుకోలేదని సర్పంచ్ ధ్వజమెత్తారు. సచివాలయ భవనాన్ని హడావుడిగా ప్రారంభించారని, అసంపూర్తిగా పనులు ఉండడంతో పాలన పరాయి పంచన జరుగుతోందని, సచివాలయ భవనాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఆత్రేయపురం సర్పంచ్ గెడ్డం సుధ సభ దృష్టికి తీసుకువచ్చారు. వర్షాలు కురుస్తుండడంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య బృందం గ్రామాల్లో పర్యటించి వ్యాధుల నిర్మూలనకు చర్యలు చేపట్టాలని ఎంపీపీ అన్నపూర్ణ పేర్కొన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు లేవనెత్తిన సమస్యలను అధికారులు సమన్వయంతో పరిష్కరించాలని ఆమె సూచించారు. వివిధ శాఖల అధికారులు తాము చేపడుతున్న పథకాలను వివరించారు. జడ్పీటీసీ బోనం సాయిబాబా, ఎంపీడీవో వెంకటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



భువనేశ్వరి పుట్టినరోజు సందర్భంగా మలికిపురంలో కేక్ కట్‌చేస్తున్న దేవ

సీఎం సతీమణి భువనేశ్వరి పుట్టినరోజు వేడుకలు

పి.గన్నవరం, జూన్ 20: సీఎం నారా చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి పుట్టినరోజు వేడుకను లంకల గన్నవరంలో గురువారం సాయంత్రం నిర్వహించారు. మాజీ ఎంపీపీ అంబటి భూలక్ష్మి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబుకు తినిపించి అనంతరం టీడీపీ శ్రేణులకు అందించారు. తొలేటి సత్తిబాబు, సంసాని పెద్దిరాజు, అంబటి కోటేశ్వరావు, అవనిగడ్డ సత్తిబాబు, రాణి శ్రీనివాసశర్మ, ఆరుమిల్లి లాల్‌బాబు, వేమన రామకృష్ణ, బొరుసు శేఖర్, బండారు శ్రీను, కొండ భాస్కరరావు, పెదపూడి రాము, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

మలికిపురం: నారా భువనేశ్వరి పుట్టినరోజు సందర్భంగా మలికిపురం ఎల్ఎస్ ల్యాండ్ మార్క్‌లో రాజోలు ఎమ్మెల్యే విజేత దేవ వరప్రసాద్ గురువారం కేక్ కట్ చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి కంప్యూటర్ ఉచిత శిక్షణ

కొత్తపేట, జూన్ 20: కొత్తపేట విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ కంప్యూటర్ అప్లికేషన్స్ ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ పాసైన విద్యార్థులకు శుక్రవారం నుంచి కంప్యూటర్ ఉచిత శిక్షణ అందిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు తెలిపారు. ఈ శిక్షణ ప్రతీరోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు బ్యాచ్‌లుగా ప్రతీ బ్యాచ్‌లోను 30 మంది విద్యార్థులకు శిక్షణ ఉంటుందన్నారు. ఒక గంట థియరీ క్లాస్‌తో పాటు అందుబాటులో ఉన్న అధునాతనమైన కంప్యూటర్స్‌పై రెండు గంటలు ప్రాక్టికల్స్ చేయిస్తామన్నారు.

యోగా గురువులకు సన్మానం

అమలాపురం టౌన్, జూన్ 20: అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా ఒకరోజు ముందుగానే స్వామి వివేకానంద యోగాశ్రమంలో యోగా గురువులను సత్కరించారు.యోగాశ్రమం వ్యవస్థాపకుడు ఆకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో 89 ఏళ్ల యోగా గురువు మారిశెట్టి సత్యనారాయణ, కుడుపూడి సత్యనారాయణ, బండారు కృష్ణసందీప్, గరిమెళ్ల నారాయణమూర్తి, పుత్సా కృష్ణకామేశ్వర్‌లను సత్కరించారు. కార్యక్రమంలో సీహెచ్ వివేకా, గరిమెళ్ల నాగదేవి, దేవసేన, గరిమెళ్ల అమృతవల్లి, ఎం.పూర్ణ, కె.ప్రవల్లిక తదితరులు పాల్గొన్నారు.

నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

అమలాపురం టౌన్, జూన్ 20: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఉదయం 6 నుంచి 8 గంటల వరకు జిల్లా స్థాయిలో వేడుకలు నిర్వహిస్తున్నట్టు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. అమలాపురం ఓంశాంతి నిలయంలోని హార్మోనీ హౌస్‌లో జరిగే కార్యక్రమానికి జిల్లా స్థాయి అధికారులంతా హాజరు కావాలని కోరారు.

ఇసుక, గ్రావెల్ అక్రమాలకు అడ్డుకట్ట వేయాలి

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరరావు



మండపేట, జూన్ 20: మండపేట నియోజకవర్గంలో గత వైసీపీ ప్రభుత్వంలో ఇసుక, గ్రావెల్ దోపిడీ అడ్డగోలుగా జరిగిందని, ఎన్ని ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరరావు ఆరోపిం చారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే కపిలేశ్వరపురం మండలంలో ఇసుక నిల్వలను అక్రమంగా తరలించి ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టడాన్ని తప్పుబట్టారు. దీనిని కట్టడి చేయాలన్నారు. కూటమి పార్టీలు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుక విధానం అమలు చేయాలని కోరారు. ఇసుక, గ్రావెల్, మట్టి అక్రమ తవ్వకాలు, తరలింపును అడ్డుకోవాలని కోరారు. దోపిడీని అడ్డుకుని ఇసుక నిల్వలను సీజ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మొక్కు తీర్చుకున్న మహిళలు

మలికిపురం, జూన్ 20:

రాజోలు నియోజకవర్గంలో దేవ వరప్రసాద్, రాష్ట్రంలో పవన్‌కల్యాణ్ విజయం కోరుతూ రాజోలు నియోజకవర్గ వీర మహిళలు అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి పాదయాత్ర చేస్తామని మొక్కుకున్నారు. మలికిపురం సెంటరు వద్ద పాదయాత్రను ఎమ్మెల్యే విజేత దేవ వరప్రసాద్ గురువారం జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో గుండుబోగుల పెదకాపు, జక్కంపూడి శ్రీనివాస్, జి.ఫణికుమార్, గుబ్బల రవికిరణ్, కుసుమ నాని, వీర మహిళలు జక్కంపూడి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



ముత్తాతకు కనకాభిషేకం

అంబాజీపేట, జూన్ 20: మాచవరం పంచాయతీ పరిధి కోఠి వారి అగ్రహారంలో మునిమనుమడితో ముత్తాతకు కనకాభిషేకం జరిగింది. కొత్తూరి సత్యనారాయణమూర్తి (చిట్టిబాబు) కుమారుడు సుబ్రహ్మణ్యం కుమారుడు ధర్మతేజ ఆస్ట్రేలియాలో స్థిరపడ్డారు. అతడికి కుమారుడు శ్రీ అద్వైత్ జన్మించాడు. ఈ నేపథ్యంలో గురువారం ఆ చిన్నారితో ముత్తాతకు కనకాభిషేకం చేయించారు. చిట్టిబాబుకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు వున్నారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు గణపతి వీరరాఘవులు, బొంతు పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాయవరం, జూన్ 20: రాయవరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో 11 కేవీ మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ రామచంద్రపురం ఈఈ వై.విజయనంద్ తెలిపారు. నదురుబాద ఫీడర్‌లో మెయింటెనెన్స్ కారణంగా రాయవరం, నదురుబాద, వి.సావరం గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

మామిడికుదురు: 33 కేవీ లైన్‌లో పాడైపోయిన విద్యుత్ స్తంభాలను మార్చేందుకు నగరం సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు. నగరం, మామిడికుదురు, పాశర్లపూడి, పాశర్లపూడి బాడవ, బి.దొడ్డవరం, పెదపట్నంలంక, అప్పనపల్లి, పెదపట్నం, పాశర్లపూడిలంక, బాడిలంక, తాటిపాక గ్రామాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ముమ్మిడివరం: విద్యుత్ తీగల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు. ముమ్మిడివరం విద్యుత్ స్టేషన్ పరిధిలో 11కేవీ విద్యుత్ లైను మరమ్మతుల నేపథ్యంలో మండలంలోని అన్ని గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు.

ఆత్రేయపురం: ఆత్రేయపురం, పేరవరం, అంకంపాలెం సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం 17 గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయ కలుగుతుందని విద్యుత్ శాఖ ఈఈ ఎం.రవికుమార్ పేర్కొన్నారు. ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

అన్నదాన ట్రస్టుకు రూ.50వేలు విరాళం

ఆత్రేయపురం, జూన్ 20: కోనసీమ తిరుమల వాడపల్లిలో వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణానికి విశాఖపట్నానికి చెందిన కొవ్వూరి జ్యోతి కుటుంబసభ్యులు రూ.50వేలు విరాళం సమర్పించారు. వివిధ సేవల ద్వారా గురువారం ఒక్కరోజు ఆదాయం రూ.1,72,997 లభించినట్టు ఈవో భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు.

ఘనంగా బలుసులమ్మ జాతర

రాయవరం, జూన్ 20: రాయవరం గ్రామస్తుల ఇలవేల్పు బలుసులమ్మ అమ్మవారి జాతరను గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. అమ్మవారి ప్రతిరూపాలైన గరగలను గ్రామంలో ఊరేగించారు. శనివారం తీర్థం సందర్భంగా భక్తులకు అమ్మవారి దర్శనం కల్పిస్తామని నిర్వాహకులు చెప్పారు.



జలవనరుల శాఖ మంత్రిని కలిసిన 'నామన'

మామిడికుదురు, జూన్ 20: జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు పాలకొల్లులో గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. దుశ్శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛంతో అభినందించారు. టీటీడీ పాలకమండలిమాజీ సభ్యుడు డొక్కా నాథ్‌బాబు, సంసాని పెద్దిరాజు, సూదా బాబ్జి, సుందరనీడి రాజేష్‌కుమార్, కొమ్ముల నందిబాబు, శేరు శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి హామీ బకాయిలను తక్షణం చెల్లించాలి'

అమలాపురం రూరల్, జూన్ 20: ఉపాధి హామీ పథకం బకాయిలను కూలీలకు తక్షణం చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు డిమాండు చేశారు. గురువారం ఆయన ఎ.వేమవరంలో ఉపాధి హామీ కూలీలతో సమావేశమయ్యారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన పవన్‌కల్యాణ్ ఉపాధి హామీ నిధులను హార్టీకల్చర్‌కు అనుసంధానం చేస్తూ సంతకం చేశారని, దీనిపై పునరాలోచన చేయాలని కోరారు. ఉపాధి హామీలో కొత్త పనులు చేర్చడంతో పాటు 200 రోజుల పనిదినాలు కల్పించాలని డిమాండు చేశారు. జిల్లా నాయకులు పొలమూరి శ్రీనివాసరావు, పెట్టా ఆనందరావు, వి.అనంతలక్ష్మి, వి.నాగదేవి, ఎం.విజయలక్ష్మి, పద్మ తదితరులు పాల్గొన్నారు.